ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 23 నవంబరు 2025



యువతకు శిక్షణతో ఉపాధి అవకాశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పీఎంకేవీవై 4.0 పథకం ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాం. జిల్లాలో నియోజకవర్గానికి ఒక్కొక్క స్కిల్ హబ్ ద్వారా శిక్షణ నిర్వహిస్తాం. ఈ నెలఖారు నుంచి మూడు లేదా నాలుగు నెలలపాటు ఉచిత శిక్షణ కల్పిస్తాం. మరింత సమాచారం కోసం 9989512143 నెంబర్‌లో సంప్రదించాల'ని సాయికుమార్ సూచించారు.



పైడిభీమవరం పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం



లారీ నుంచి వెలువడుతున్న పొగ కాలుష్యం



చిలకపాలెం- పొందూరు రోడ్డులో కాలుష్యానికి గురై రంగు మారిన చెట్లు

కమ్మేస్తున్న కాలుష్యం

- జిల్లాలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయన వాయువులు
- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- వ్యాధులబారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు పచ్చని పంట పొలాలు.. స్వచ్ఛమైన గాలికి చిరునామాగా నిలిచిన శ్రీకాకుళం జిల్లా ఇప్పుడు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటోంది. జిల్లాలో విస్తరిస్తున్న పారిశ్రామిక వాడలు ఇష్టారాజ్యంగా కాలుష్యాన్ని విడిచిపెడుతూ.. ప్రజలకు ముప్పు తెస్తున్నాయి. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ప్రజలకు స్వచ్ఛమైన గాలి కరువవుతోంది. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నిబంధనల ప్రకారం పరిశ్రమలు ఎప్పటికప్పుడు గాలి నాణ్యతను పరీక్షించాలి. ప్రమాదకర వాయువులను శుద్ధి చేశాకే బయటకు వదలాలి. కానీ జిల్లాలోని చాలా పరిశ్రమలు ఈ నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయనే ఆరోపణలున్నాయి. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా కాలుష్యభరిత గాలిని పీల్చి జిల్లాలో చాలామంది దగ్గు, జలుబుతోపాటు శ్వాసకోశ, చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. గత రెండేళ్లలో శ్వాసకోశ సంబంధిత కేసుల శాతం కూడా పెరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

● పైడిభీమవరంలో దారుణం..

జిల్లాలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రమైన పైడిభీమవరం (రణస్థలం మండలం)లో కాలుష్యం పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఇక్కడ ఫార్మా కంపెనీలు, రసాయన పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ వాయువులు రాత్రి వేళల్లో పరిసర ప్రాంతాలను కమ్మేస్తున్నాయి. ఘాటైన వాసనతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎచ్చెర్ల, ఆమదాలవలస పరిసరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పైడిభీమవరంలోని ఔషధ పరిశ్రమల నుంచి వెలువడే రసాయన గాలులు ప్రధాన సమస్య. సాధారణ వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) 50-80 మధ్య ఉండాలి. కానీ పైడిభీమవరం పరిసరాల్లో ఇది తరచూ నిర్దిష్ట సంఖ్య దాటుతున్నట్లు సమాచారం. రాత్రివేళల్లో ఈ స్థాయి ఇంకా ఎక్కువగా ఉంటోంది.

● అంతటా దుమ్ము, ధూళి..

పలాస, టెక్కలి ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు, క్రషర్లు, జీడిపిక్కల పరిశ్రమల నుంచి వచ్చే దుమ్ము, ధూళి విపరీతంగా పెరిగిపోయింది. ఈ ధూళి ఇళ్లపై, చెట్లపై, చివరికి పంట పొలాలపై కూడా ఒక పొరలా సిమెంట్ రంగులో ఏర్పడుతోంది. దుమ్ము, ధూళి, కాలుష్యం కారణంగా చిన్నారులు, వృద్ధులకు ఆయాసం, ఉబ్బసం(ఆస్తమా), చర్మ సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానిక వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రుల్లో శ్వాసకోశ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటా పదిహేను శాతం పెరుగుతోందని స్పష్టం చేస్తున్నారు. అలాగే టెక్కలి, సంతబొమ్మాళి, పాతపట్నం, పొందూరు ప్రాంతాల్లోని స్టోన్‌క్రషర్లు ప్రధాన వాయు కాలుష్య కారకాలు. నిబంధనల ప్రకారం క్రషర్ల నుంచి వెలువడే దుమ్ము (సస్పెండెడ్ పర్టిక్యులేట్ మేటర్-ఎస్‌పీఎం) 600 మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్ మించకూడదు. కానీ చాలా చోట్ల పరిమితికి మించి దాటుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) తనిఖీల్లో తేలింది. ఇటీవల కొన్ని క్రషర్లకు అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు.

● పంటలకు ముప్పు..

వాయు కాలుష్యం ప్రభావం వ్యవసాయంపై కూడా పడుతోంది. గాలిలో రసాయనాల మోతాదు పెరగడం వల్ల కొబ్బరి, జీడితోటల దిగుబడి తగ్గుతోందని రైతులు వాపోతున్నారు. ఆకులు నల్లబడి రాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా (మిగతా 7వ పేజీలో..)



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

- 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం. అకాల వర్షాలు కారణంగా రంగుమారిన, తడిచిన ధాన్యానికి కూడా మద్దతు ధర కల్పిస్తామ'ని రాష్ట్ర వ్యవసాయాశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రాంభించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ 'జిల్లాలో 6.50లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యం. 406 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 264 రైస్ మిల్లులకు అందిస్తాం. ఏ గ్రేడ్ ధాన్యం బస్తాకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు లేకుండా శతశాతం ఈ-క్రాప్ నమోదు చేశాం. వైసీపీ ప్రభుత్వ పాలనలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా సాగింది. రైతులకు సక్రమంగా నగదు చెల్లించలేదు. ప్రస్తుతం ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తాం. నరసన్నపేట మండలం కంబకాయలో ఓ రైతుకు నాలుగు గంటల్లోనే జమ చేశాం. గతంలో రైతులు ఇచ్ఛాపురంలో ధాన్యం విక్రయిస్తే.. వాటిని కోటబొమ్మాళి, నరసన్నపేట మిల్లులకు పంపించేవారు. దీంతో రైతులు చాలా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రైతులు నచ్చిన రైస్‌మిల్లుకు వెళ్లి ఈ నెల నుంచి మార్చి వరకు ధాన్యం విక్రయించుకోవచ్చ'ని తెలిపారు. బ్యాంకు గ్యారంటీ తీసుకోవడంలో మిల్లర్ల నిర్లక్ష్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో 264 మిల్లులు ఉండగా, ఇప్పటి వరకు 33 మంది మాత్రమే బ్యాంకు గ్యారంటీలు తీసుకున్నారని తెలిపారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు తీసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం రైతులకు వేరుశెనగ వితనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వేణుగోపాల్, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఏడీఏ కె.జగన్మోహన్ రావు, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్, పీఏసీఎస్ అధ్యక్షు రాలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, జిల్లా మిల్లర్లు అధ్యక్షుడు బోయిన రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టీడీపీ నాయకులు కర్రి అప్పారావు, సాసుమంతు ఆనందరావు, పూజారి శైలజ, బాడాన రమ ణమ్మ, కోరాడ గోవిందరావు, కోటబొమ్మాళి మిల్లర్ల అధ్యక్షుడు ఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వాడడు.. గుర్తింపు కార్డు ఉండదు

- చాకచక్యంగా తాళాలు పగులగొట్టేస్తాడు
- ఇప్పటివరకు 218 చోరీలు
- తెలుగు రాష్ట్రాల్లోనే 'మోస్ట్‌వాంటెడ్' గజదొంగ దున్న కృష్ణ అరెస్ట్
- కోల్‌కత్తా నుంచి వచ్చి దొంగతనం చేసి.. ఉడాయింపు
- ఎట్టకేలకు పట్టుకున్న రూరల్ పోలీసులు



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, పోలీసుల అదుపులో నిందితులు

శ్రీకాకుళం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్, గుర్తింపు కార్డు లేకుండా వరుస చోరీలకు పాల్పడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో మోస్ట్‌వాంటెడ్ గజదొంగగా పేరొందిన దున్న కృష్ణ ఎట్టకేలకు శ్రీకాకుళం రూరల్ పోలీసులకు పట్టుబడ్డాడు. రెండు నెలల కిందట శ్రీకాకుళం మండలంలో చోరీకి పాల్పడిన కృష్ణ.. కోల్‌కత్తా నుంచి మరో చోరీ చేపట్టేందుకు శ్రీకాకుళం వచ్చి పోలీసులకు చిక్కాడు. కృష్ణతోపాటు చోరీల్లో ఆయనకు సహకరించిన సయ్యద్ రఫీని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.33,25,539 విలువైన బంగారం, వెండి ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. శనివారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన దున్న కృష్ణ దొంగతనాలకు అలవాటుపడి.. జైలుకు వెళ్లి వస్తూ.. మళ్లీ చోరీలకు పాల్పడుతుండేవాడు. తెలుగురాష్ట్రాల్లో 218 చోరీలకు పాల్పడి.. ఏకంగా ఇప్పటివరకు 50 కిలోల బంగారం, 300 కిలోల వెండి ఆభరణాలను, ఒక కిలో ప్లాటినం వస్తువులను చోరీ చేసినట్లు పోలీసు రికార్డుల్లో ఉంది. ఇప్పటికే 60 చోరీ కేసులకు సంబంధించి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా దొంగతనాలను ఆపలేదు. కొన్నాళ్ల కిందట జైలులో శ్రీకాకుళం నగరం గూనపాలెం ప్రాంతానికి చెందిన సయ్యద్ రఫీతో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో చోరీ సొత్తును సయ్యద్ రఫీతో బయట విక్రయించేవాడు. శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌లో 14 కేసులు, శ్రీకాకుళం టూటౌన్‌లో 3 కేసులు, వన్‌టౌన్‌లో 1 కేసు నమోదైంది. రెండు నెలల కిందట శ్రీకాకుళం ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో ఎతురాజుల భవానీ ఇంట్లో వెండి ఆభరణాలను చోరీ చేశాడు. దీనిపై కేసు నమోదు చేశారు. అప్పటినుంచి కృష్ణ కోసం పోలీసులు గాలించారు. ఇటీవల శ్రీకాకుళం మండలం ఒప్పంగి గ్రామంలో మరో చోరీ కోసం కోల్‌కత్తా నుంచి వచ్చిన కృష్ణను నిఘా బృందంతో పట్టుకుని విచారణ చేపట్టారు. శ్రీకాకుళంలో (మిగతా 6వ పేజీలో..)

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇ.అనూరాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలోని అర్హత, ఆసక్తి గల బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోగా శ్రీకాకుళం వాంబే కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. డిసెంబరు 5న విశాఖపట్నంలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా, మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తాం. వీరికి విజయవాడలోని బీసీ భవన్ శిక్షణ కేంద్రంలో ఉచిత స్టడీ మెటీరియల్, భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. అభ్యర్థులు బయోడేటాతోపాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం(వార్షికాదాయం రూ.లక్ష లోపు) ధ్రువపత్రం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జెరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కార్యాలయంలో దరఖాస్తు అందించాలి. మరిన్ని వివరాలకు 83328 52106, 73829 75679 నెంబర్లలో సంప్రదించాల'ని ఆమె తెలిపారు.

కొత్త అంబులెన్స్ ప్రారంభం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్తగా కొనుగోలు చేసిన అంబులెన్స్‌ను ప్రజాసేవకు అంకితం చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో శనివారం కొత్త అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత అంబులెన్స్ పాడైన విషయాన్ని రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు తనకు తెలియజేశారని, వెంటనే రూ.19.54 లక్షలతో కొత్త అంబులెన్స్ కొనుగోలు చేశామన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరిన్, రెడ్‌క్రాస్ సభ్యులు కణుగుల సుధీర్, దుర్గా శ్రీనివాసరావు, వైకుంఠరావు, సత్యనారాయణ, రమణ, సతీష్, పి.చైతన్య పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీసీ వేణుగోపాల్

సమగ్రశిక్ష ఏపీసీగా వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా పప్పల వేణుగోపాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మర్యాదపూర్వకంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రజాప్రతినిధులకు భద్రత పెంపు
● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
బాలల హక్కులను కాపాడాలి
7లో




- మెళియాపుట్టి మండలం బందపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని 30 ఏళ్ల కిందట నిర్మించగా.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో మూడేళ్ల నుంచి ఓ అద్దె భవనంలో 12మంది చిన్నారులతో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నా.. మంజూరు కాకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

- మెళియాపుట్టి మండలం జోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో సుమారు 21 మంది పిల్లులు ఉన్నారు. ఐదేళ్ల కిందట నిధులు మంజూరు చేయగా.. కొత్త భవన నిర్మాణ పనులు మధ్యలోనే వదిలేశారు. ఆ భవనాన్ని స్థానికులు కొంతమంది పశువులకు వినియోగిస్తున్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు!

- మెళియాపుట్టి మండలం పెద్దమడి అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు చిన్నారులు ఉన్నారు. 'నాడు-నేడు' నిధులతో నూతన భవనం నిర్మాణ పనులు చేపట్టగా.. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపేశారు.



- అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు
- పనుల్లో కనిపించని పురోగతి

మెళియాపుట్టి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. చాలా కేంద్రాలకు సొంతగూడు లేక అద్దె భవనాల్లో సాగుతున్నాయి. అరకొర వసతులతో సిబ్బందికి, చిన్నారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జిల్లాలో 2,786 ప్రధాన, 599 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సొంత భవనాలతోపాటు ప్రభుత్వ స్థలాల్లో 1,620 ఉన్నాయి. 1,765 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద 215 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. వీటిలో 192 భవనాల నిర్మాణం ప్రారంభించగా సకాలంలో బిల్లులు మంజూరు కాక పనులు మధ్యలోనే నిలిపేశారు. వీటిని పూర్తిచేయాలంటే రూ.15.36కోట్లు (మిగతా 6వ పేజీలో..)

మైదానాలున్నా ఆటల్లేవ్

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పీడీల కొరత
- క్రీడలకు దూరంగా విద్యార్థులు



రణస్థలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడామైదానం

రణస్థలం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలు ఇటీవల జరిగాయి. మరి జూనియర్ కాలేజీ విద్యార్థులకు అంటే మాత్రం సమాధానం దొరకదు. దీనికి కారణం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పీడీలు లేకపోవడం. ప్రభుత్వ కాలేజీలతో పోల్చుకుంటే ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో పీడీల నియామకం జరుగుతుండడంతో అంతర్ యూనివర్సిటీ, జోనల్‌స్థాయిలో ప్రైవేటు విద్యార్థులే మెరుస్తున్నారు. ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల జాడ లేదు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో సగం రోజులు పూర్తయ్యాయి. కానీ కాలేజీల్లో క్రీడల దుస్థితి మాత్రం నానాటికీ తీసికట్టుగా మారింది.

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ విద్యార్థులు 6,491 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,895 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళాశాలలన్నింటికీ క్రీడా మైదానాలు ఉన్నాయి. కానీ విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు కనీస స్థాయిలో ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు సైతం లేకపోవడం దారుణం. గతంలో జూనియర్ కాలేజీల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు కొనసాగేవి. ఏటా క్రమం తప్పకుండా క్రీడాపోటీలు నిర్వహించేవారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉండేవారు. కానీ వారు పదవీవిరమణ చెందిన తర్వాత కొత్తగా పోస్టులు భర్తీ చేయలేదు. సబ్జెక్టు బోధకుల మాదిరి కాంట్రాక్టు ప్రతిపాదికన నియమించలేదు. దీంతో కాలేజీల్లో క్రీడా శిక్షణ లేకుండా పోయింది. జిల్లాకేంద్రంలో ప్రభుత్వ కాలేజీల్లో సైతం క్రీడలు నిర్వహించని దుస్థితి నెలకొంది.

● మైదానాలు అస్తవ్యస్తం

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానాలకు సంబంధించి సరైన నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. కొన్నిచోట్ల గత వైసీపీ సర్కారు నాడు-నేడు పనుల పేరిట భవన నిర్మాణ సామగ్రితోపాటు తొలగించిన భవనాలకు సంబంధించి వేస్ట్ మెటీరియల్‌ను పడేసింది. వైసీపీ పాలనలో ప్రభుత్వ కాలేజీల స్థాయిలో (మిగతా 7వ పేజీలో..)

రహదారులు అభివృద్ధికి చిహ్నాలు

- మంత్రి అచ్చెన్నాయుడు
- రూ.3.50కోట్లతో పాత జాతీయ రహదారి పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రహదారులు అభివృద్ధికి చిహ్నాలు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం జగతిమెట్ట జంక్షన్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర రెండు లేన్ల విస్తరణకు గాను రూ.3.50 కోట్లతో జరిగే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పట్టణ ప్రాంతాల్లో రహదారులు విస్తరణతో పాటు డివైడర్‌పై మొక్కలు పెంపకం, వాకింగ్ ట్రాక్ వంటి పనులు జరిపించడంతో సుందరీకరణగా ఉంటుందన్నారు. రహదారి లేని ప్రాంతాలు ఉండకూడదని, తన నియోజకవర్గ పరిధిలో అన్ని రహదారులు ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం కోటి రూపాయలతో అయ్యప్ప నగర్ నుంచి జాతీయరహదారి వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే డిగ్రీ కళాశాల ప్రహరీ, ఎన్టీఆర్ క్యాంటీన్, మండాపొలం కాలనీ డ్రైనేజీలు పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. జగనన్న కాలనీవాసులు మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, కింజరాపు ప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, సుందరమ్మ, దమయంతి, లవ, కామేసు, గండి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

రైతులు రబీ సీజన్‌లో ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాలు సబ్సిడీపై అందజేశారు. రాగులు, పెసర, మినుము, కట్టిజనుము వంటి ఆరుతడి పంటలు వేయడం ద్వారా రైతులకు నీటి వనరుల ఇబ్బంది తప్పుతుందన్నారు. ఏవో చిరంజీవి, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బగాది శేషగిరి, కింజరాపు ప్రసాద్, పినకాన అజయ్‌కుమార్, లాడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం నిరుపేదలై అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. గుల్లవానిపేటకు చెందిన సింగిపల్ల ప్రాచీన అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో ఆమెకు రూ97,983, పూడివానిపేటకు చెందిన పూడి నీలకంఠంకు రూ52,522 చొప్పున చెక్కులు అందజేశారు. పార్టీ సమన్వయకర్త బగ్గు అర్చన, నాయకులు నాగేశ్వరరావు, రవి, బాబూరావు, దాసరి రఘు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదోడికి భరోసా


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదోడికి అండాదండగా కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా నిలుస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు బాధితులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నపద్మాపురం గ్రామానికి చెందిన పుప్పల రాజేశ్వరి కుటుంబానికి రూ.2,00,059, ఇటీవల మృతి చెందిన తామర గ్రామానికి చెందిన కొమనాపల్లి విజయ కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, రుంకు చలపతిరావు, శివాల చిన్నయ్య, నందిగామ ఆనందరావు, కలమట భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం బోధించాలి: డీఈవో

ఎల్ఎన్ పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకొని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని డీఈవో రవిబాబు తెలిపారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్‌ను శనివారం ఆయన సందర్శించారు. అదే విధంగా స్కూల్ కాంప్లెక్సులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఎంఈవో కె.చంద్రమౌళి, హెచ్ఎం ఎం.సింహాచలం, సీఆర్పీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- సరుబుజ్జిలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో కె.రవిబాబు అన్నారు. కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం ఆయన పరిశీలించారు. సమావేశంలో ఎంఈవోలు బాలరాజు, శ్రీనివాసరావు, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ బాధితులను ఆదుకోండి


ఎమ్మెల్యే అశోక్‌కు వినతి పత్రం అందిస్తున్న బాధితులు

ఇచ్ఛాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో రూ.2.86 కోట్లు భారీ స్కాం జరిగిందని, తాము దాచుకున్న డబ్బులను ఇప్పించాలని ఆదుకోవాలని పలువురు బాధితులు కోరారు. శనివారం రామయ్యపుట్టుగంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మేం సేవింగ్ చేసిన సొమ్ములు ఇవ్వాలని అనేక పర్యాయాలు సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీను, దేవేంద్ర, ప్రశాంత్‌కుమార్, జ్యోతిసాయి తదితరులు పాల్గొన్నారు.

- సోంపేట రూరల్: మాకన్నపురానికి చెందిన చిత్రాడ రమేష్ కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగులేకపోవడంతో సీఎంఆర్ఎఫ్ నిధులు రూ.1.19 లక్షలు మంజూరయ్యాయి. శనివారం చెక్కును ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాధితుడి తండ్రి బాబూరావుకు అందించారు.

మరమ్మతులు చేయండి


మట్టి వేసి వదిలేసిన దృశ్యం

పలాసరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తర్లాకోట జంక్షన్ నుంచి గొప్పిలికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో అల్లుకోల హరిసాగరం వద్ద ఇటీవల వర్షాలకు రోడ్డు కోతకు గురికావడంతో మట్టిని తీసుకొచ్చి వేశారు. అయితే మట్టి వేసి వారం రోజులు దాటినా ఇప్పటివరకూ ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మరమ్మతులకు తీసుకొచ్చిన మట్టిని రోడ్డుకు వినియోగించుకొని త్వరితగతిన పని చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేకపోవడం వల్ల వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దేశభక్తి భావాలను పెంపొందించాలి


వందేమాతరం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్థులు

పాతపట్నం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డు ఉపాధ్యాయుడు పి.రామరాజు అన్నారు. లాబరలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వందేమాతరం 150వ వసంతోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం వి.భాస్కరరావు, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ పి.గణపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంపై వివరించండి


మాట్లాడుతున్న ఏడీ చంద్రశేఖర్

నందిగాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెరటికోళ్ల పెంపకంపై రైతులకు వివరించాలని నందిగాం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.చంద్రశేఖర్ సూచించారు. శనివారం స్థానిక పశువైద్య ప్రాంతీయ కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ సచివాలయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవారీ పురోగతి వివరాలను సమీక్షిస్తూ పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో పశువైద్యాధికారులు ఎం.పాపారావు, టి.మన్మథరావు, కె.మధుబాబు, పారావేటర్ దేవేంద్ర, అప్పన్న, షణ్ముఖరావు తదితరులు ఉన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

పలాస, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో 14 కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్టు రైల్వే ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన గిరిధర్ జానీ, రవినాయక్ గంజాయిని ముంబాయికి తరలించేందుకు స్థానిక రైల్వేస్టేషన్‌లో తచ్చాడుతుండగా.. అనుమానం వచ్చి తనిఖీలు చేపట్టగా గంజాయి పట్టుబడింది. దీంతో నిందితులను విశాఖ రైల్వే కోర్టుకి తరలించినట్టు తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


వంటవాళ్లతో మాట్లాడుతున్న యశోధలక్ష్మి

పాతపట్నం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ వై.యశోదలక్ష్మి తెలిపారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలను ఆమె శనివారం ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పరిసరాలను డార్మెటరీ భోజనశాలను పరిశీలించారు. కుకింగ్ సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడి, మెనూపై ఆరా తీశారు. ఉత్తమ ఫలితాల సాధనకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి బోధన చేపట్టాలన్నారు. ప్రిన్సిపాల్ పి.పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ధర్మారావు

మందస/ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మందస మండలం బాలిగాం గ్రామం వద్ద శనివారం సా యంత్రం రోడ్డు ప్రమాదంలో గుజ్జు ధర్మారావు(45) మృతి చెందినట్టు ఎస్ఐ కృష్ణప్రసాద్ తెలిపారు. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ధర్మరావు ద్విచక్రవాహనంపై మందస వస్తుండగా.. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. 108 వాహనంలో హరిపురం సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కుళాయిలకు ట్యాప్‌లేవీ?


నీరు పట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్న మహిళలు

హిరమండలం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలంలోని చిన్న కోరాడవీధిలో రక్షిత నీటి పథకం పైపుల నుంచి వచ్చే తాగునీటిని పట్టుకునేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. తీవ్ర నీటి ఎద్దడి కారణంగా గత ఏడాది జలజీవన్ మిషన్ కింద వీధిలో పైపులైన్లు వేశారు. పాత పైపులైన్ ద్వారా నీటి సరఫరా నిలిపివేసి కొత్త పైపులు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైపులకు ట్యాప్‌లు అమర్చకపోవడంతో నీటి పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ట్యాప్‌లు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు!

(ఐదో పేజీ తరువాయి)

అవసరమని అధికారులు గుర్తించారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల పరిష్కారంతోపాటు సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి సూపర్‌వైజర్ అమరావతి వద్ద ప్రస్తావించగా.. 'గతంలో కొత్త భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు పూర్తికాలేదు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. బిల్లులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామ'ని తెలిపారు.

మెరుగైన బోధనకు దోహదపడతాయి


సూచనలిస్తున్న ఎంఈవో మాధవరావు

జలుమూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మకమైన క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన అందించడానికి స్కూల్ కాంప్లెక్స్‌లు ఎంతగానో దోహదపడతామని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. చల్లవానిపేట ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో ఎంఈవో-2 ప్రసాదరావు, సబ్జక్టుల వారీగా ఉపాధ్యాయ నిపుణులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వాడడు.. గుర్తింపు కార్డు ఉండదు

(ఐదో పేజీ తరువాయి)

సయ్యద్ రఫీతోపాటు.. కోల్‌కత్తాలో అంతనపుల్, తరున్‌మండల్ అనే ఇద్దరి వ్యక్తుల ద్వారా చోరీ సొత్తును విక్రయించేవాడినని అంగీకరించాడు. దున్న కృష్ణ నుంచి రూ.33,25,539 బంగారం, వెండి ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. కృష్ణతోపాటు సయ్యద్ రఫీని కూడా అరెస్ట్ చేశామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. మోస్ట్‌వాంటెడ్ గజదొంగ దున్న కృష్ణ చోరీలు చాకచక్యంగా నిర్వహిస్తాడని.. సెల్‌ఫోన్ వినియోగించడని, ఎటువంటి ఐడీ కార్డు కూడా అతని వద్ద ఉండదన్నారు. తమ విచారణలో శ్రీకాకుళంలో 18 ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. గజదొంగను పట్టుకున్న ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడాపునాయుడు, చంద్రమౌళి, ఎస్సైలు రాజేష్, గణేష్, రాము, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రోడ్డు సమీపంలోని తాంబ్రిసిమెట్ట వద్ద శనివారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ జి.మధుసూదనరావు తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు నుంచి భువనేశ్వర్ వైపు వెళ్లే రైలు మార్గంలో ఈ ఘటన చోటు చేసు కుందన్నారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, నల్లటి దుస్తులు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

టెక్కలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెద్దసాన గ్రామంలో శుక్రవారం రాత్రి ఒక ద్విచక్ర వాహనం దగ్ధమైంది. గ్రామానికి చెందిన పి.తమ్మయ్య తన బైక్‌ను ఇంటి వద్ద పార్క్ చేయగా కాలిపోయిందని, ఇది గుర్తుతెలియనివారి పనేనని తమ్మయ్య అనుమానిస్తున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

శాంతి చర్చలు జరపాలి


మాట్లాడుతున్న ప్రజాసంఘ నాయకులు

వజ్రపుకొత్తూర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే శాంతియుత చర్చలు జరపాలని, బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలని సీపీఐ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం మండలం మర్రిపాడు అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల స్మారక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సహాయ కార్యాదర్శి వంకల మాధవరావు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేష్ తదిరులు మాట్లాడారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయా లైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. కళ్లేపల్లి పంచాయతీ సాధుపేట గ్రామానికి చెందిన సాధు కృష్ణారావు(38) శనివారం ఉదయం తన గ్రామం నుంచి శ్రీకాకుళం ద్విచక్ర వాహనంపై వస్తుండగా సాధుపేట జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు పరస్పరం ఢీకొనడంతో కృష్ణారావు కుడికాలికి తీవ్రంగా గాయాలై రక్తస్రావం జరిగింది. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు.

కృష్ణమూర్తి సేవలు మరువలేనివి


స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నందిగాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతిగా పేరొందిన పినకాన కృష్ణమూర్తి సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా నాయకులు బవిరి కృష్ణమూర్తి అన్నారు. పినకాన కృష్ణమూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం రాంపురం పంచాయతీ చిన్నలక్ష్మీపురం జంక్షన్ వద్ద గల ఆయన స్థూపం వద్ద నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరాడ మోహనరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం.షన్ముఖరావు, టీడీపీ నేత పినకాన అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూట్ మిల్లు పరిశీలన


జూట్ మిల్లు నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


నరసన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అందరూ అప్రమత్తం కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్ సూచించారు. విద్యార్థులకు వృత్తివిద్య శిక్షణలో భాగంగా సింగుపురం వద్ద గల జూట్ మిల్లును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జనపనార పరిశ్రమకు కావాల్సిన ముడిసరుకు, వాటి వినియోగం, యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, కార్మికుల వేతనాలు, రికార్డుల నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు రామారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానికంగా ధాన్యం అమ్మేలా చూడండి

మెళియాపుట్టి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రైస్ మిల్లుల్లో ధాన్యం అమ్ముకొనేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ బి.పాపరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తుఫాన్ వల్ల యంత్రలు ద్వారా నూరుపులు చేసిన ధాన్యం కోటబొమ్మాళి మిల్లులకు తరలించాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నార, దీనివల్ల రైతులు అవస్థలకు గురవుతున్నట్టు టీడీపీ నాయకులు ఉర్లాన వసంత్‌రావు తెలిపారు. స్థానికంగా ఉన్న మిల్లులో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గౌడు కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడో, సిలార్ తదితరులు ఉన్నారు. అలాగే జోడూరు రైతుసేవా కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పాపారావు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.మోహనరావు, వెంకట్రావ్, దినకర్, భాస్కర్‌గౌడో, వసంత్, పరమేష్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సత్యసాయికి ఘన నివాళి

పలాసరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం దరి సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో శనివారం విద్యార్థుల ఆధ్వర్యంలో పుట్టపర్తి సత్యసాయి 100వ జయంతి పురస్కరించుకొని మానవహారంగా విద్యార్థులంతా నివాళులర్పించారు. విద్యార్థులంతా 100వ బర్త్‌డే స్వామి ఆకారంలో కూర్చొని నివాళులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, పీఈటీ కిరణ్, గురునాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.


'100వ బర్త్ డే స్వామి' ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

25న మండల సమావేశం

కోటబొమ్మాళి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరావు అధ్యక్షతన ఈనెల 25న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని, ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

ఆరుతడి పంటలు వేసుకోవాలి

నరసన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రబీలో ఆరుతడి పంటలు వేయాలని ఏవో సూర్యకుమారి అన్నారు. శనివారం తామరాపల్లి, జమ్ము గ్రామంలో వేరుశెనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రబీలో వేరుశెగన, మొక్కజొన్న, అపరాలు పంటలు వేయాలన్నారు. 30 కిలోల వేరుశెగన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రూ.1700లకు అందిస్తున్నట్టు తెలిపారు. పి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కోటబొమ్మాళి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ వినతని అందజేశారు. వచ్చిన వినత పత్రాలను స్వయంగా పరిశీలించి గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతందన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

మెళియాపుట్టి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర శబరిమల వెళ్తున్న అయ్యప్పస్వామి భక్తులకు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పాతపట్నం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి సలాన శరత్‌కుమార్ తెలిపారు. అధికంగా ఆంధ్రా నుంచి వెళుతున్న స్వాములకు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు ప్రాంతీయబేదం చూపి అవమానించడం జరుగుతుందన్నారు. కేరళ ప్రభుత్వం తాగడానికి కనీసం మంచి నీరు కూడా అందివ్వకపోవడం దారుమన్నారు. ఎంతో నిష్టానియమాలతో పూజలు చేసి శబరిమల వెళ్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో కల్పించుకుని అయ్యప్ప స్వామి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చూడాలన్నారు.

నాణ్యతమైన విద్యను అందించాలి

నందిగాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో-1, 2 జి.నర్సింహులు, ఎ.చిన్నారావు ఉపాధ్యాయుల్ని సూచించారు. శనివారం సాయంత్రం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యాశాఖ పేర్కొన్న పలు అంశాలను వివరిస్తూ విద్యా బోధనతో విద్యార్థుల్ని ఆకర్షితుల్ని చేసి తద్వారా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

జాబ్‌కార్డులు పునరుద్ధరణ

ఎల్ఎన్ పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కూలీలకు ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి కల్పించేందుకే కూలీలకు జాబ్‌కార్డులు పునరుద్ధరించడం జరుగుతుందని ఏపీవో శ్రీదేవి తెలిపారు. లక్ష్మీనర్సుపేట, తురకపేట గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఇంతవరకు జాబ్‌కార్డులు లేకుండా ఉన్నవారికి జాబ్‌కార్డులు ఇస్తామన్నారు. హౌసింగ్ కోసం కొత్త జాబ్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్‌పాణిగ్రాహి, టీఏ ఆర్.లక్ష్మణరావు, ఎఫ్ఏ సంజీవ్‌కుమార్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ఎల్ఎన్ పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలను ఆర్జించవచ్చనని ఎఫ్ఎంటీలు లలిత, సూర్యనారాయణ తెలిపారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో సీనియర్ ఐసీఆర్పీలు, ట్రైనీ ఐసీఆర్పీలతో శనివారం నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏటీఎం ఎ-గ్రేడ్ మోడల్‌పైన, రబీ డ్రై సోయింగ్‌తోపాటు 365 రోజులు అన్నిరకాల పంటలను పండించుకోవచ్చునని తెలిపారు. ప్రసాద్, జ్యోతి, పూర్ణ, సతీష్, సాయి, రాంబాబు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు తప్పనిసరి

నరసన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసే వేతనదారులకు జాబ్‌కార్డు కలిగి ఉండాలని డుమా పీడీ సుధాకర్ సూచించారు. శనివారం చిన్నబొరిగివలస గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసే వేతనదారులకు జాబ్‌కార్డు యాక్టివేషన్‌లో లేకుంటే వెంటనే పునరుద్ధించాలన్నారు. నిబంధనలు మేరకు పనులు చేయాలని. ఉపాధి పథకంలో అక్రమాలకు కళ్లెం చేసేందుకు ప్రభుత్వం నూతన విధానం అమలలోకి తీసువచ్చిందన్నారు. ఏపీవో యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం ప్రారంభం

పోలాకి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మబగాంలో చిన్నమ్మతల్లి దేవాలయ ప్రారంభోత్సవం శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు వేద పండితులు లక్ష్మీధనుంజయ శర్మ ఆధ్వర్యంలో దంపతులకు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు పాల్గొని పూజలు చేశారు. గ్రామస్థులంతా కలిసి చిన్నమ్మతల్లి ఆలయాన్ని నిర్మించుకున్నారు.

బోధనను మెరుగుపర్చుకోవాలి

ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బోధనా పద్ధతులను మెరుగుప రచుకోవాలని, వెనుకబడిన సీ,డీ గ్రేడ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం అన్నారు. శనివారం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ల ఆధ్వర్యంలో పాఠశాలల సముదాయం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, ఆయా పాఠశాలల క్లస్టర్‌స్థాయిలో, ఉన్నత పాఠ శాలలకు చెందిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవర ణలో స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్వహిం చారు. ఈ శిక్షణను వారు పరిశీలించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై దృష్టి సారించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల దర్యాప్తు, నిందితుల అరెస్టు, చార్జిషీట్ దాఖలు, ప్రాపర్టీ స్వాధీనం తదితర అంశాలపై సమీక్షించారు. తీవ్రమైన కేసుల్లో నిశితమైన ఆధారాలతో సమగ్రమైన దర్యాప్తు చేపట్టి పురోగతి సాధించా లన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలు, గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయాలన్నారు. డిసెంబరు 13న జరగబోయే లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. పోక్సో కేసుల్లో దర్యాప్తు నిర్ణీత 60 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రాపర్టీ నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్థులు, జైలు నుంచి విడుదలైన నేరస్థులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అంతర్రాష్ట్ర గ్యాంగ్‌లు, వ్యక్తులపై నిఘా పెంచాలన్నారు. సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో చాక చక్యంగా వ్యవహరించి ప్రతిభ కనబరిచిన శ్రీకాకుళం రూరల్, సీసీఎస్, నరసన్నపేట, ట్రాఫిక్ సీఐలు పైడిపు నాయుడు, చంద్రమౌళి, శ్రీనివాసరావు రామారావు, గతంలో పాతపట్నం ఫింగర్ ప్రింట్ అండ్ క్లూస్ ఇన్‌చార్జి భరత్‌కుమార్‌తో పాటు పలువురు ఎస్ఐలు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, డి.లక్ష్మణ రావు, ఏవో సీహెచ్.గోపీనాథ్, ఎస్‌బీ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

న్యూస్ బాక్స్

ప్రజాప్రతినిధులకు భద్రత పెంపు: ఎస్పీ

శ్రీకాకుళం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజాప్రతినిధులకు, మాజీ ప్రజాప్రతి నిధులకు భద్రత పెంపుదల చేశామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మావోయిస్టుల ఎన్‌కౌంటర్ ఘటన నేపథ్యంలో జిల్లాలో ప్రజా ప్రతినిధులకు, మాజీ ప్రజా ప్రతినిధులకు భద్రత పెంపు చేశాం. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంటుంది. మావోయిస్టులకు అనుకూలంగా.. కొంతమంది సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లు చేస్తున్నారు. దీనిపై సర్వైలెన్స్ ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు మద్దతిచ్చినట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన మావోయిస్టు చెల్లూరి నారాయణరావు లేరు' అని స్పష్టం చేశారు. జిల్లాలో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణపై స్పందిస్తూ.. హైవేపైనా.. ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టామని వెల్లడించారు.

ఎస్ఐగా అప్పలసూరి



లావేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా కొండపల్లి అప్పలసూరి శని వారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మన్యం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన జి.లక్ష్మణరావు ఎచ్చెర్ల బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ అప్పలసూరి విలేకర్లతో మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

చిన్నారులకు పరుపుల పంపిణీ


పరుపులను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి మౌలానా

శ్రీకాకుళం లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో శనివారం జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా చిల్డ్రన్స్‌హోంలో ఉంటున్న చిన్నారులకు పరుపులను అందజేశారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు ఇటీవల శ్రీకూర్మంలోని నవజీవన్ చిల్డ్రన్ హోంని సందర్శించిన సందర్భంలో అక్కడ చిన్నారులకు పరుపులు లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంకులను సంప్రదించగా వారు పరుపులను ఏర్పాటు చేయగా వాటిని అందించారు. కార్యక్రమంలో పలువురు న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలి


నిరసన తెలుపుతున్న రైతులు

సోంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోంపేట కొత్తబంద చెరువు ఆక్రమణలు అడ్డుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు శనివారం వారు నిరసన తెలిపారు. సర్వే నెంబరు 2002లో 5.38 ఎకరాల కొత్తబంద చెరువును పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణం అధికారులు స్పందించి సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బీన ఆనంద్, బీన ఈశ్వరరావు, పొందూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్‌గా 'కొండా'


శంకర్ రెడ్డి

ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్‌గా ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన టీడీపీ నేత, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్, మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అశోక్ అభినందించారు.

తవ్వి వదిలేశారు..


సెంటర్ లైటింగ్ కోసం డివైడర్ పక్కనే తవ్విన గోతులు

ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): పట్టణ పరిధిలోని సంత పేట నుంచి ఇచ్ఛాపురం వరకు సెంటర్ లైటింగ్ పనులను చేపడుతున్నారు. ఈ పనులకు సంబం ధించి డివైడర్ పక్కన రోడ్డును తవ్వారు. కాని పనులు ఇప్పటి వరకు ప్రారంభించక పోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ సెంటర్ డివైడర్ పక్కన గోతులు చీకటిలో కనిపించకపోవడంతో పలువురు వాహనదారులు గాయాలపాలవుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కమ్మేస్తున్న కాలుష్యం

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు మేల్కొని కాలుష్య నియంత్రణకు కఠినచర్యలు తీసుకోకపోతే.. భవిష్యత్తులో శ్రీకాకుళం మరో విషవలయంగా మారే ప్రమాదం ఉంది.

● **కానరాని చర్యలు..**

శ్రీకాకుళం నగరానికి వేలాదిమంది ప్రతిరోజు.. పలు పనుల నిమిత్తం వస్తుంటారు. ఇక్కడ మధ్యాహ్నం భోజనం చేసి వెళ్తుంటారు. ఎక్కువగా హోటల్స్‌పై ఆధారపడతారు. అయితే హోటళ్లలో వంట చెరకుగా జీడి పిక్కల తొక్కలను, వరి ధాన్యపు పొట్టు(ఊక)ను వినియోగిస్తున్నారు. దీని వల్ల ప్రతిరోజు పొగగొట్టం నుంచి పైకి నల్లని పొగ విడుదలవుతోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా తీసుకున్న చర్యలు లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జిల్లాలో పెరుగుతున్న కాలు ష్యం, నమోదవుతున్న శ్వాసకో వ్యాధులపై సమీక్ష నిర్వహించాలి. నిబంధ నలు ఉల్లంఘించేవాటిపై కలెక్టర్ చర్యలకు ఉపక్రమించాలని పలువురు కోరుతున్నారు.

మైదానాలున్నా ఆటల్లేవ్

(ఐదో పేజీ తరువాయి)

క్రీడాపోటీలు కూడా నిర్వహించలేదు. ఎన్నికలకు ముందు గ్రామాల్లో మాత్రం 'ఆడుదాం ఆంధ్రా' పేరిట హడావుడి చేశారు. అంతకు మించి క్రీడల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి చూపిన దాఖలాలు మాత్రం లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం కళాశాలల్లో క్రీడా పోటీల నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వ్యాయామ ఉపాధ్యాయులను కూడా భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

● **దృష్టిపెట్టాం..**

వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై దృష్టిపెట్టాం. జిల్లాలోని 38 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నియామకాలకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించనున్నాం.

-సురేష్‌కుమార్, జిల్లా వృత్తివిద్యాధికారి, శ్రీకాకుళం

జాతీయస్థాయి చెస్ పోటీలకు డొంకూరు విద్యార్థులు

ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి చెస్ పోటీలకు డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం హేమకుమారి తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన బాల బాలికల రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అండర్-14 బాలురు విభాగంలో డి.చరణ్, అండర్-15 విభాగంలో డి.గోకుల్, డి.పృథ్వి పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. వీరంతా ఆది, సోమవారాల్లో విజయవాడలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు శనివారం వారు పయనమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కె.జానికిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: జాతీయ చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పయనం

ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సరస్వతి, భవాని, తేజశ్రీ, హారిక, లావణ్య ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో విద్యార్థినులను కాదా లక్ష్మీ కాంతమ్మతో పాటు హెచ్‌ఎం అభినందించారు. ఈ పోటీలు ఆది, సోమవారాల్లో విజయనగరంలో జరుగుతాయని, వీటిలో పాల్గొనేందుకు పయనమయ్యారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపి కవ్వాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గిన్ని వెంకటరమణ, కోఆప్షన్ సభ్యుడు బి.కృష్ణయ్య, పీఈటీ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోటీలకు పయనమవుతున్న విద్యార్థినులతో హెచ్‌ఎం తదితరులు


ఎచ్చెర్ల: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి కరాటే, కబడ్డీ పోటీలకు..

ఎచ్చెర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు బొంతలకోడూరు జడ్పీహెచ్‌ఎస్ విద్యా ర్థులు ఎంపికయ్యారు. కబడ్డీ పోటీలకు ఓ.కార్తీక్ కుమార్, కరాటే పోటీలకు వి.మోహన్ కుమార్ ఎంపికైనట్లు పీడీ రవికుమార్ అన్నారు. వీరిద్దరూ ఈనెలలో రాష్ట్రంలోని వేర్వేరు వేదికలపై నిర్వహించే పోటీలకు హాజరవుతారన్నారు. విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన రవికుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు

గార, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ జాబ్ కార్డులను మంజూరు చేస్తామని ఏపీవో సీహెచ్ సంధ్యారాణి అన్నారు. శీకూర్మంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటికీ సుమారు 14 వేల వరకు జాబ్‌కార్డులు ఉన్నాయని, జాబ్ కార్డులు కావాల్సిన వారికి కొత్తగా మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరు అనిత, మాజీ సర్పంచ్ బడగల వెంకట అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరమ్మ పాల్గొ న్నారు.

● కవిటి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనులు కావాలని కోరిన అర్హులందరికీ జాబ్ కార్డులు అందించాలని సర్పంచ్ పి.లక్ష్మణరావు కోరారు. కవిటి మేజర్ పంచాయతీలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈకెవైసీలో తప్పిపోయిన కార్డులను పరిశీలించి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఈవో ఎం.రవి, ఎంపీటీసీ పి.నీలాచలం, టీడీపీ నేతలు బి.రమేష్, ఎ. మధు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బూర్జ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీడి మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులను పాటించాలని ఉద్యానశాఖ విస్తరణాధికారి తిరుపతిరావు అన్నారు. అడ్డూరిపేటలో శనివారం రైతులకు అవగాహన కలిగించారు. నవంబరు నుంచి ఏప్రిల్ నెల వరకు రైతులు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వస్తుందన్నారు. తెగుళ్లు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రత్యేక నిధులు వినియోగించుకోండి

కంచిలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రత్యేక నిధులను సద్వినియోగం చేయాలని రాష్ట్ర పీఎంశ్రీ పాఠశాలల సీనియర్ లెక్చరర్ పుల్లట రమేష్ అన్నారు. శుక్రవారం ఎంఎస్‌పల్లి జడ్పీ ఉన్నత, ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో చిట్టిబాబు, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

కార్గో వినియోగదారులకు అభినందన

అరసవల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గోలో అక్టోబరులో ఎక్కువగా పార్సిల్స్ బుక్‌చేసిన పలువురు వినియోగదారులకు శనివారం అభినందించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ శాలువ, అభినందన పత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు అమర సింహుడు, శర్మ, పలాస డిపో మేనేజర్ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ (కమర్షియల్) దివ్య, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

● ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్


ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఎస్ఐ సుధాకర్

పాత శ్రీకాకుళం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన దారులు నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ అన్నారు. శనివారం పాత బస్టాండ్ వద్ద వాహనదారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి బయటపడవచ్చన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని, ఓవర్ స్పీడ్‌తో వెళ్లరాదన్నారు. మొబైల్‌లో మాట్లాడుతూ వాహనం నడిపినా, మద్యం సేవించి డ్రైవింగ్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న చలానాలు ఆన్‌లైన్‌లో తెలుసుకోవడం, ఫోన్ పేలో చలానా చెల్లించే విధానాన్ని ట్రాఫిక్ సిబ్బంది వివరించారు. అనేక మంది వాహనదారులు పెండింగ్ చలానాలు చెల్లించినట్లు సుధాకర్ తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

జి.సిగడాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని జిల్లా బాలల రక్షణ విభాగం అధికారి ఐ.లక్ష్మనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జాతీయ దత్తత మాసోత్సవాల్లో భాగంగా పిల్లల దత్తత ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృత్వం వరంలాంటిదన్నారు. సంతానం లేక బాధపడుతున్న వారు చట్టపరంగా దత్తత మిషన్ వెబ్‌సైట్ ద్వారా నిబంధనల మేరకు దత్తత తీసుకోవచ్చన్నారు. బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులను నివారించాలని, మత్తు పదార్థాలకు బాలలు బానిసలు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా బాలల రక్షణ విభాగం అధికారి లక్ష్మనాయుడు

బాల్యవివాహాలను అరికట్టాలి

నరుబుజ్జిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఎం.పావని అన్నారు. బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 'బేటీబచావో... బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా జాతీయ దత్త మాసోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ, అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో గీత, సూప ర్‌వైజర్లు జానకి, అమ్మన్నమ్మ, వెలుగు ఏపీఎం గోవిందరాజులు, బాలల హక్కుల పరిరక్షణ విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగీత గురువు నర్సింహారెడ్డికి నివాళి

ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టి బరంపురానికి చెందిన ప్రముఖ సంగీత గురువు కప్ప నర్సింహారెడ్డి 21వ వర్ధంతి కార్యక్రమం శనివారం మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రంగాల జానకిరామ్‌రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, తిప్పన ధనుంజయరెడ్డి, గంగయ్య, వినోద్ కుమార్, రామారావు పాల్గొన్నారు.





